రోజుకు 25 గంటలు

- భూభ్రమణ వేగం తగ్గడంతో కాల గణనలో కొత్త పరిణామం
- భూ గ్రహానికి చంద్రుడు దూరమవ్వడమే కారణం
- జర్మనీ, అమెరికా దేశాల పరిశోధకుల అధ్యయనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): రోజులో ఎన్ని గంటలంటే.. 24 అని చెప్తాం. అయితే, భవిష్యత్తులో మరో గంటను జోడించి రోజుకు 25 గంటలు అని చెప్పాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. భూ భ్రమణ వేగం నెమ్మదించడంతో రోజులో మరో గంట అదనంగా చేరుతున్నట్టు జర్మనీలోని మ్యూనిక్ టెక్నికల్ యూనివర్సిటీ, అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తెలిపారు.

ఎందుకిలా?

భూమి నుంచి చంద్రుడు ఏటికేడు 3.8 సెంటిమీటర్ల చొప్పున దూరంగా జరుగుతుండటంతో గురుత్వాకర్షణ బలాల్లో తేడాలు రావడం, చంద్రుడి ప్రభావంతో సముద్రాల్లో ఏర్పడే అలల్లో మార్పులు, వాతావరణ ప్రభావం కారణంగా భూభ్రమణ వేగం తగ్గుతున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. భూమిలో 20 అడుగుల లోతులో ఉంచిన రింగ్ లేజర్ టెక్నాలజీతో ఈ మార్పులు కనుగొన్నట్టు పేర్కొన్నారు.

కొత్తదేం కాదు

భూభ్రమణ వేగంలో మార్పుల వల్ల రోజులోని గంటల్లో మార్పులనేది కొత్తదేం కాదని శాస్త్రవేత్తలు గుర్తు చేస్తున్నారు. 1.4 బిలియన్ సంవత్సరాల కిందట భూమికి చంద్రుడు ఎంతో దగ్గరగా ఉండటంతో రోజులో 18 గంటలు మాత్రమే ఉండేవని చెప్తున్నారు.

రోజుకు 25 గంటలు ఎప్పుడు?

రోజుకు 25 గంటలు అనేది ఇప్పటికిప్పుడు జరిగే మార్పేం కాదు. వచ్చే 20 కోట్ల ఏండ్ల తర్వాతనే ఈ మార్పు చూడొచ్చని పరిశోధకులు చెప్తున్నారు. అప్పుడు క్యాలెండర్లలో లెక్కలతో పాటు గ్లోబల్ సిస్టమ్‌లోని అటామిక్ క్లాక్ నుంచి ఎయిర్‌లైన్స్ వరకూ అన్నింట్లోనూ సర్దుబాట్లు చేయాల్సి ఉంటుంది.

10,000 అడుగుల ఎత్తు నుంచి దూకి..!

- యూకేకు చెందిన మహిళా స్కైడైవర్ మృతి
- బ్రేకప్ అయిన మరుసటి రోజే ఘటన
- పారాచూట్‌ను ఉద్దేశపూర్వకంగానే తెరవని జేడ్!

లండన్, మే 27: ప్రియుడితో బ్రేకప్ అయిన మరుసటి రోజే యూకేకు చెందిన మహిళా స్కైడైవర్ 10,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేస్తూ కింద పడి మరణించారు. పారాచూటింగ్‌లో 450కిపైగా జంపింగ్‌ల అనుభవం ఉన్న జేడ్ డమారెల్.. స్కైడైవింగ్ చేస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగానే పారాచూట్‌ను తెరవలేదని అధికారులు అనుమానిస్తున్నారు. డుర్హాం కౌంటీలోని షాటన్ కొలియరీలో ఈ ఘటన జరగింది. ఘటనా స్థలికి చేరుకున్న అత్యవసర బృందాలు ఆమె స్పాట్‌లోనే మృతి చెందినట్టు నిర్ధారించాయి. స్కైడైవర్ కూడా అయిన 26 ఏండ్ల ప్రియుడితో ఆమె గత ఆరు నెలలుగా డేటింగ్‌లో ఉంటూ సహజీవనం చేస్తున్నది. అయితే వీరిద్దరి రిలేషన్‌షిప్ విచ్ఛిన్నం అయిన మరునాడే ఆమె అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే తొలుత దానిని ప్రమాదంగా భావించినా ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా స్కైహై సంస్థ తెలిపింది. ఆమె పారాచూట్ వైఫల్యం చెందే అవకాశాలు ఏమీ కన్పించలేదని, ఆమె కావాలనే పారాచూట్ తెరుచుకునే బటన్‌ను నొక్కకుండా ఈ చర్యకు పాల్పడినట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. జేడ్ సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, బహుశా ప్రియుడితో బ్రేకప్ కారణంగానే ఆమె ఈ చర్యకు పాల్పడి ఉంటుందని ఆమె స్నేహితురాలు తెలిపింది.

47 ఏండ్ల మాక్రాన్ | 72 ఏండ్ల బ్రిగిట్

టీచర్-స్టూడెంట్ లవ్ స్టోరీ

న్యూఢిల్లీ, మే 27: వియత్నాం పర్యటనకు వచ్చిన సందర్భంగా విమానం నుంచి దిగడానికి ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌ను ఆయన భార్య బ్రిగిట్ మాక్రాన్ చెంపదెబ్బ కొట్టడం తీవ్ర చర్చనీయాంశం అయింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో వీరిద్దరి బంధం వార్తల్లోకి ఎక్కింది. మాక్రాన్ వయసు 47 ఏండ్లు కాగా, ఆయన భార్య వయసు 72 ఏండ్లు కావడం గమనార్హం. అమియన్స్‌లోని క్యాథలిక్ లైసీ లా ప్రావిన్సులో 1993లో మొట్టమొదటిసారి వారిద్దరూ కలుసుకున్నారు. అప్పుడు బ్రిగిట్ వయసు 39. ఆమె హైస్కూలు టీచర్. 15 ఏళ్ల ఇమ్మానుయేల్ ఆమె వద్ద విద్యార్థి. ఆంద్రూ లూయిస్ ఓజీర్ అనే బ్యాంకర్‌తో అప్పటికే పెళ్లయిన బ్రిగిట్‌కు ముగ్గురు పిల్లలు. ఆమె పెద్ద కుమార్తె ఇమ్మానుయెల్ క్లాస్‌మేట్. బ్రిగిట్, ఇమ్మానుయేల్ మధ్య ఏర్పడిన ప్రేమ బంధం 1994 వేసవిలో బయటపడింది. ఓ పూల్ వద్ద సన్‌బాతింగ్ చేస్తున్న వీరిని వారి కుటుంబ సభ్యులు చూశారు. ఆ తర్వాత కొద్ది కాలానికే ఓజీర్ తన భార్య బ్రిగిట్‌కి విడాకులు ఇచ్చారు. బ్రిగిట్, ఇమ్మానుయేల్ బంధం ఎవరికీ నచ్చలేదు. బ్రిగిట్ కుటుంబానికి కొందరు ఆకాశ రామన్న ఉత్తరాలు రాశారు. కొందరైతే ఆమె ఇంటి గుమ్మం వద్ద ఉమ్మి తమ చీత్కారాన్ని వ్యక్తం చేశారు. తన స్నేహితులు ఒకరి తర్వాత మరొకరు తనతో మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదని బ్రిగిట్ తన ఆత్మకథలో రాసుకున్నారు. ఆ తర్వాత ఇమ్మానుయేల్ పై చదువుల కోసం తన సొంతూరిని విడిచిపెట్టి పారిస్ వెళ్లారు. అక్కడి యూనివర్సిటీలో పాలిటిక్స్, ఇంటర్నేషనల్ అఫైర్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. తమ మధ్య ఏర్పడిన బంధం నిలుస్తుందని తాను భావించలేదని, తన వయసుకు తగ్గ అమ్మాయితో ఇమ్మానుయేల్ ప్రేమలో పడతాడని తాను ఊహించానని బ్రిగిట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. వారి మధ్య దూరం పెరిగినా బంధం మాత్రం చెక్కు చెదరలేదు. తరచు మాట్లాడుకునే వారు. వీలు దొరికినప్పుడల్లా కలుసుకునేవారు. చివరకు 2007లో వారిద్దరూ వివాహం చేసుకున్నారు.కాగా, చెంపదెబ్బ ఘటనపై మాక్రాన్ స్పందిస్తూ తన భార్య సరదాగానే చెంపను తాకినట్టు చెప్పారు.

31 వ సారి ఎవరెస్ట్ అధిరోహణ

- తన రికార్డు తానే బద్దలు కొట్టిన నేపాల్ 'ఎవరెస్ట్ మ్యాన్' కమి రిటా

కాఠ్‌మాండూ: 'ఎవరెస్ట్ మ్యాన్'గా గుర్తింపు పొందిన నేపాలీ షెర్పా 31వసారి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం ఎవరెస్ట్‌ను అధిరోహించి, తన రికార్డును తానే బద్దలు కొట్టారు. మంగళవారం 55 ఏండ్ల కమి రిటా షెర్పా ఈ ఘనతను సాధించారు. ఎవరెస్ట్‌ను ఈయన కంటే ఎక్కువసార్లు ఎవరూ ఇప్పటివరకు ఎక్కలేదని సెవెన్ సమ్మిట్ ట్రెక్స్ సంస్థ తెలిపింది. 'ఆయన గురించి పరిచయ వాక్యాలు అక్కర్లేదు. ఆయన కేవలం జాతీయ పర్వతారోహక హీరో మాత్రమే కాదు.. ఎవరెస్ట్ శిఖరానికే అంతర్జాతీయ చిహ్నం' అని ఆ సంస్థ కొనియాడింది. కమి రిటా వాణిజ్య యాత్రలో భాగంగా 1994లో మొదటిసారి ఎవరెస్ట్‌ను అధిరోహించారు.

అమెరికాలో కొవిడ్‌తో వారానికి 350 మంది మృతి!

- అగ్రరాజ్యంలో విజృంభిస్తున్న కరోనా వైరస్ మహమ్మారి
- మరణాలు మరింత పెరగొచ్చని వైద్య రంగ నిపుణుల అంచనా
- ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కారణంగానే అధిక కేసులు

వాషింగ్టన్ : అమెరికాలో కొవిడ్-19 వైరస్ విజృంభిస్తున్నది. వందల్లో మరణాలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు వంటి హైరిస్క్ గ్రూప్ వారికి కరోనా ప్రాణ సంకటంగా మారిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో గత నెల రోజుల్లో సగటున వారానికి 350 వరకు కరోనా మరణాలు నమోదైనట్టు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) గణాంకాలు చెప్తున్నాయి. ఇవి మరింత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో నమోదవుతున్న కేసుల్లో అత్యధికం ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌వే అని సీడీసీ తెలిపింది. చైనాలో మళ్లీ కొవిడ్ కేసులు పెరగడానికి, ఇతర ఆసియా దేశాల్లో కేసులు నమోదు కావడానికి ఈ వేరియంటే కారణం. కొత్త వేరియంట్ కేసులు అమెరికాలోని వాషింగ్టన్, కాలిఫోర్నియా, న్యూయార్క్ సిటీ, వర్జీనియా తదితర రాష్ట్రాల్లో రోజూ నమోదవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని విమానాశ్రయాల్లో విదేశీ పర్యాటకులకు పరీక్షలు నిర్వహించగా ఎన్‌బీ.1.8.1 వేరియంట్ బాధితులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ తదితర దేశాల ప్రయాణికుల్లో ఈ వైరస్‌ను గుర్తిస్తున్నామన్నారు. ఒహియో, హవాయి తదితర రాష్ట్రాల్లో స్థానికుల్లోనూ ఈ వైరస్ సోకిందన్నారు. ఈ పరిణామాలపై డ్యూక్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ టోనీ మూడీ స్పందిస్తూ.. 'ఈ స్థాయిలో మరణాలు నమోదవుతున్నాయంటే వైరస్ మన చుట్టూ వ్యాపించి ఉన్నదని అర్థం. సమీప భవిష్యత్తులో కేసులు మరింత పెరిగే అవకాశం ఉన్నది' అని పేర్కొన్నారు. అమెరికాలో వ్యాక్సినేషన్ తక్కువగా నమోదవడం, ప్రజల్లో రోగనిరోధక శక్తి క్షీణించడం, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వంటి కారణాల వల్లే కొవిడ్ విజృంభిస్తున్నదని స్పష్టం చేశారు.

బూస్టర్ డోస్ తీసుకోవాలా?

న్యూఢిల్లీ, మే 27: దేశంలో కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం నాటికి దేశవ్యాప్తంగా 1,010 కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ సాధారణ నివారణ చర్యలు పాటిస్తే చాలని స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నప్పటికీ గత వేవ్‌లతో పోలిస్తే ప్రస్తుతం ఈ ఇన్ఫెక్షన్ సోకినవారి సంఖ్య చాలా తక్కువేనని తెలిపారు. కొవిడ్ బారిన పడినవారిలో వ్యాధి తీవ్రత చాలా తక్కువగా ఉండటంతో అత్యధిక రోగులకు ఓపీడీ (ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్)లోనే సేవలందించి పంపించేస్తున్నామని, కేవలం కొద్ది మందికి మాత్రమే హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఏర్పడుతున్నదని వైద్యులు చెప్తున్నారు. ఎవరికైనా దగ్గు, గొంతు నొప్పి లేదా ఫ్లూ లాంటి లక్షణాలుంటే ఇండ్లకే పరిమితమై వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఏ రోగికైనా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నదని భావించి వైద్యుడు సూచిస్తే తప్ప మిగతావారు బూస్టర్ డోస్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.

డిస్మిస్ అయిన ఉద్యోగికి పింఛన్ కట్

కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి (పీఎస్‌యూ) చెందిన ఉద్యోగి ఉద్యోగం నుంచి డిస్మిస్ లేదా ఉద్వాసన పొందితే తన పదవీ విరమణ ప్రయోజనాలను కోల్పోవలసి వస్తుందని కేంద్రం మంగళవారం ప్రకటించింది. అయితే బర్తరఫ్ లేదా ఉద్వాసన అంశం సంబంధిత పాలనా వ్యవహారాలు చూసే శాఖ సమీక్షకు లోబడి ఉంటుందని తెలిపింది. ఇందుకు సంబంధించి కేంద్ర సివిల్ సర్వీసెస్(పింఛను) నిబంధనలు, 2021లో కీలక మార్పులను కేంద్ర సిబ్బంది శాఖ తీసుకువచ్చింది. ఇటీవలే నోటిఫై చేసిన సవరణ నిబంధనలు, 2025 ప్రకారం పీఎస్‌యూలో ఏ ఉద్యోగి అయినా దుష్ప్రవర్తన కారణంగా సర్వీసు నుంచి బర్తరఫ్ లేదా ఉద్వాసనకు గురైన పక్షంలో ప్రభుత్వంలో చేసిన సర్వీసుతోసహా తాను చేసిన సర్వీసుకు సంబంధించి తన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ని కోల్పోవలసి వస్తుంది. 2003 డిసెంబర్ 31 కన్నా ముందు నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయని నోటిఫికేషన్ పేర్కొంది.

క్లాస్‌కు బంక్ కొడితే వీసా రద్దు

- భవిష్యత్తులో వీసాలు పొందేందుకూ అలాంటి వారంతా అనర్హులవుతారు
- విదేశీ విద్యార్థులకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్ర హెచ్చరిక
- వీసా నిబంధనలకు తప్పక కట్టుబడి ఉండాలని వారికి స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఏదో ఒక నెపం మోపి భారత్ సహా విదేశీ విద్యార్థులను దేశం నుంచి వెళ్లగొడుతున్న అమెరికా తాజాగా మరో వార్నింగ్ ఇచ్చింది. అమెరికాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులు (భారత్ సహా) కాలేజీ మానేసినా, విద్యాసంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా.. వారి వీసాలు రద్దు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ఒక ప్రకటన చేసింది. అమెరికాలో చదువుకోనేందుకు వచ్చిన విదేశీ విద్యార్థులందరూ తమ విద్యార్థి వీసా నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎటువంటి సమస్యలను ఎదుర్కొనకుండా ఉండాలంటే విద్యార్థి హోదాను కొనసాగించాలని స్పష్టం చేసింది. 'విద్యా సంస్థ నుంచి డ్రాపౌట్ అయినా, క్లాస్‌లకు గైర్హాజరైనా, స్టడీ ప్రోగ్రామ్ నుంచి వైదొలగినా మీ విద్యార్థి వీసాను రద్దు చేస్తాం. అంతే కాదు భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హతను కూడా కోల్పోయే అవకాశం ఉంది. కాబట్టి అమెరికాలో ఉన్నంత కాలం మీ వీసా నిబంధనలకు కట్టుబడి ఉండండి' అని ఆ ప్రకటనలో తేల్చి చెప్పింది.

అమెరికాకే మన విద్యార్థుల పాధాన్యం..

విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారతీయ విద్యార్థులు తమ మొదటి ప్రాధాన్యాన్ని ఎక్కువగా అమెరికన్ యూనివర్సిటీలకే ఇస్తుంటారు. వరుసగా మూడు సంవత్సరాలపాటు అమెరికా నుంచి అత్యధికంగా విద్యార్థి వీసాలు పొందిన దేశంగా భారత్ నిలిచింది.

చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా..

పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న వారిని, ఆ ఆందోళనలకు పరోక్షంగా మద్దతిచ్చిన వారిని, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్ట్‌లను షేర్ చేసిన వారిని సైతం ట్రంప్ సర్కారు వీసాలు రద్దు చేసి ఇంటికి పంపించింది. చిన్నచిన్న ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని సైతం వీసాలు రద్దుచేసి స్వదేశాలకు పంపించివేసింది.

హార్వర్డ్ వర్సిటీతో ట్రంప్ కయ్యం..

ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి సంబంధించి ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రకటన ఆ విశ్వవిద్యాలయంలో చదువుకొంటున్న విదేశీ విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే అర్హతను ట్రంప్ ప్రభుత్వం ఈ నెల 22న రద్దు చేసింది. అయితే కోర్ట్ ఈ నిర్ణయాన్ని నిలిపేసింది.

విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు నిలిపేసిన ట్రంప్

కొత్త విద్యార్థులకు వీసాలు జారీ చేసేందుకు నిర్వహించే ఇంటర్వ్యూ ప్రక్రియను నిలిపివేయాలని అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యూఎస్‌లో విద్యనభ్యసించడానికి విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో వారి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని భావించిన ట్రంప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. తమ దేశానికి వచ్చే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను పూర్తిగా పరిశీలిస్తామని అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

20 కోట్ల రుణం.. ఏడుగురి బలవన్మరణం

హర్యానాలో దారుణం

చండీగఢ్, మే 27: అప్పుల భారం ఒకే కుటుంబంలోని ఏడుగురిని చిదిమేసింది. రుణ ఊబిలో కూరుకుని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు అనుమానాస్పద స్థితిలో మరణించిన ఘటన హర్యానాలోని పంచకులలో వెలుగుచూసింది. ఇందులో ఆరుగురు కారులోనే మరణించగా, ఒకరు దవాఖానకు తరలిస్తుండగా మరణించారు. మృతులను 41 ఏండ్ల ప్రవీణ్ మిట్టల్, అతని భార్య, ముగ్గురు మైనర్ పిల్లలు (అందులో ఇద్దరు అమ్మాయిలు కవలలు), అతని తల్లిదండ్రులుగా పోలీసులు గుర్తించారు. డెహ్రాడూన్‌లో ఒక ఫ్యాక్టరీని నడిపిన మిట్టల్ అందులో భారీ నష్టం రావడంతో బ్యాంక్ వారు అతని ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో తాము చేసిన 15-20 కోట్ల రుణాన్ని తీర్చలేకే వీరు బలవన్మరణానికి పాల్పడ్డారని భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక కారు పంచకుల సెక్టార్ 27లోని నివాస ప్రాంతంలో సోమవారం రాత్రి పార్కు చేసి ఉంది. రాత్రి 10 గంటలకు అందులోని ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. బతికి ఉన్న మిట్టల్‌ను దవాఖానకు తరలిస్తుండగా మధ్యలోనే మరణించాడు. అందరూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నామని పంచకుల డీసీపీ తెలిపారు.

చైనా రుణ ఉచ్చులో పేద దేశాలు

- లక్ష కోట్లకు పైగా అప్పులు
- రుణం తీర్చలేక ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ, మే 27: చైనాకు చెల్లించాల్సిన రుణాలు 2025లో రికార్డు స్థాయికి చేరుకోవడంతో అత్యంత పేద దేశాలు చైనా రుణ ఉచ్చులో చిక్కుకున్నాయని ఆస్ట్రేలియాకు చెందిన ఓ అధ్యయన సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. చైనాకు చెందిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ 2010వ దశకంలో ఆఫ్రికన్ ఎడారి దేశాల నుంచి ఉష్ణ మండల దక్షిణ పసిఫిక్ దేశాల వరకు షిప్పింగ్ పోర్టులు, రైల్వేలు, రోడ్లు తదితర ప్రాజెక్టుల అభివృద్ధి కోసం విచ్చలవిడిగా రుణాలు ఇచ్చింది. రుణాలు పొందిన దేశాలు ఇప్పుడు తిరిగి చెల్లించాల్సిన సమయం ఆసన్నం కావడంతో చైనా నుంచి కొత్త రుణాలు లేక, అప్పులు చెల్లించే పరిస్థితి లేక పేద దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆస్ట్రేలియాకు చెందిన లోయీ ఇన్‌స్టిట్యూట్ తన నివేదికలో తెలిపింది. రుణాలు ఎలా చెల్లించాలో పాలుపోని స్థితికి అనేక పేద దేశాలు చేరుకున్నాయి. ఇప్పటి నుంచి మరో దశాబ్ద కాలం పాటు చైనా రుణ దాతగా కాకుండా రుణ వసూలు బ్యాంకర్‌గా మారిపోతుందని నివేదిక వ్యాఖ్యానించింది. అభివృద్ధి చెందుతున్న ఈ దేశాలు చైనాకు చెల్లించాల్సిన సొమ్ము వివరాలను ప్రపంచ బ్యాంకు వద్ద ఉన్న డాటా ఆధారం చేసుకుని లోయీ సంస్థ వెల్లడించింది.

చైనా నుంచి ఒత్తిళ్లు..

2025లో చైనాకు దాదాపు 75 అత్యంత పేద దేశాలు చెల్లించాల్సిన మొత్తం 2200 కోట్ల డాలర్లని (రూ.1.88 లక్షల కోట్లు) లోయీ సంస్థ తెలిపింది. చైనాకు అప్పు చెల్లించాల్సి ఉండడంతో రుణగ్రస్థ దేశాలలో దవాఖానలు, పాఠశాలలు, వాతావరణ మార్పులు తదితర రంగాలపై వెచ్చించాల్సిన నిధులకు భారీగా కోత పడుతుందని నివేదిక పేర్కొన్నది. ఒకపక్క రుణ చెల్లింపుల కోసం చైనా నుంచి ఒత్తిడి తీవ్రం కావడం, మరోపక్క అంతర్జాతీయ ప్రైవేట్ రుణదాతలకు చెల్లించాల్సిన రుణాలు పెరిగిపోతుండడంతో నిరుపేద దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని సంస్థ తెలిపింది. అయితే, విదేశాలకు అందచేసే ఆర్థిక సాయాన్ని అమెరికా నిలిపివేసిన తర్వాత మారిన భౌగోళిక రాజకీయ వాతావరణంలో పేద దేశాల నుంచి తనకు రావలసిన రుణాలను తన రాజకీయ ప్రయోజనాల కోసం చైనా వాడుకునే అవకాశం ఉందని కూడా సంస్థ అనుమానం వ్యక్తం చేసింది.

30 మంది 3 గంటలపాటు గాల్లోనే!

చెన్నై, మే 27: సరదాగా జాయ్‌రైడ్ ఎక్కిన జనాలు (రైడర్స్).. అది మధ్యలో ఆగిపోయే సరికి 3 గంటల పాటు గాలిలోనే గడపాల్సి వచ్చింది. ఇంజిన్ పనిచేయటం ఆగిపోవటంతో దాదాపు 50 అడుగుల ఎత్తులో జాయ్‌రైడ్ నిలిచిపోయింది. దీంట్లో చిక్కుకున్న 30 మంది రైడర్స్ కిందికి రాలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లలు, మహిళలు సహా అందరూ రాత్రి 9.30 గంటల దాకా అందులోనే చిక్కుకుపోవటంతో అందరూ టెన్షన్ పడ్డారు. సోమవారం సాయంత్రం చెన్నైలోని ఓ ప్రైవేట్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. చివరికి కొన్ని గంటల తర్వాత ఫైర్, రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకొని క్రేన్ సహాయంతో ఒక్కొక్కరిని కిందికి తీసుకొచ్చారు.

అష్ట దిగ్బంధంలో యూనస్ సర్కార్

- నిరసనల హోరుతో ఉక్కిరి బిక్కిరి
- నాలుగో రోజు సమ్మెలో ప్రభుత్వ సివిల్ సర్వెంట్స్
- జత కలిసిన ప్రైమరీ స్కూలు టీచర్లు
- ఎన్నికల కోసం పార్టీల ఆందోళన
- ఆర్మీ చీఫ్ నుంచి ఒత్తిడి ఉద్ధృతం

ఢాకాలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆ దేశ ప్రభుత్వ సివిల్ సర్వెంట్ ఉద్యోగులు

ఢాకా: సైన్యం, రాజకీయ పార్టీల నుంచి విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న మహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి మరో కొత్త సవాలు ఎదురైంది. గత శనివారం నుంచి సివిల్ సర్వెంట్స్ సమ్మె చేస్తుండగా తాజాగా తమ జీతాలు పెంచాలని డిమాండు చేస్తూ ప్రైమరీ అసిస్టెంట్ టీచర్స్ యూనిటీ కౌన్సిల్ పేరుతో టీచర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు.

అగ్గి రాజేసిన ఆర్డినెన్స్

దేశంలో త్వరితంగా ఎన్నికలు నిర్వహించాలని సైన్యాధ్యక్షుడు జనరల్ వకర్ ఉజ్ జమాన్ ఆదేశించిన దరిమిలా తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వచ్చిన కొన్ని రోజుల్లోనే ఆపద్ధర్మ ప్రభుత్వానికి అన్ని వైపుల నుంచి నిరసనలు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తింది. దుష్ప్రవర్తనకు పాల్పడిన సివిల్ సర్వెంట్స్‌ని 14 రోజుల్లోగా ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేసేందుకు అనుమతినిస్తూ యూనస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీనిపై బ్యూరోక్రసీ నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు తమ ఆందోళనను విస్తరిస్తామని సివిల్ సర్వెంట్స్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాజకీయ సంక్షోభం

గడచిన కొన్ని వారాలుగా యూనస్ ప్రభుత్వం రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. త్వరితంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేస్తూ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ)తోసహా వివిధ రాజకీయ పార్టీలు ఇటీవల నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. తాను చేపట్టనున్న కీలకమైన సంస్కరణలకు రాజకీయ పార్టీల నుంచి మద్దతు లేని కారణంగా తన పదవికి రాజీనామా చేస్తానని మే 23న యూనస్ హెచ్చరించారు. ఎన్నికల కార్యాచరణను ప్రకటించాలని బీఎన్‌పీ డిమాండు చేస్తుండగా డిసెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని జమాన్ హెచ్చరికలు జారీ చేసింది. అధికారాన్ని పట్టుకుని వేళ్లాడేందుకే యూనస్ ఎన్నికలను జాప్యం చేస్తున్నారని ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీ ఆరోపించింది. కాగా, యూనస్ మద్దతుదారులైన విద్యార్థి నాయకులకు చెందిన నేషనల్ సిటిజన్స్ పార్టీ ఢాకాలో యూనస్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించాలని సంకల్పించింది. తమ ప్రభుత్వానికి ఆటంకాలు కల్పిస్తే ప్రజల మద్దతుతో చర్యలు తీసుకుంటామని కూడా యూనస్ ప్రభుత్వం హెచ్చరించింది. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం కోసం వివిధ రాజకీయ పార్టీలతో యూనస్ గత వారాంతంలో అనేక సమావేశాలు నిర్వహించారు. దేశంలో సాధ్యమైనంత త్వరలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని రాజకీయ పార్టీలు, సైన్యాధ్యక్షుడు జమాన్ పట్టుపడుతున్న నేపథ్యంలో దేశంలో రోజురోజుకూ రాజకీయ అనిశ్చితి పెరుగుతున్నది.

ఐబీఎంలో 8000 మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ కంపెనీ ఐబీఎం 8వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇందులో హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. 200 మంది హెచ్ఆర్ ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆధారిత ఏజెంట్లను నియమించింది. సంస్థలో హెచ్ఆర్ విభాగం నిర్వర్తించే విధులు, ఉద్యోగుల మెయిల్స్‌కు సమాధానమివ్వడం, పేపర్ వర్క్ వంటివి ప